జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com

www.jatheeyavaartha.com

# జాతీయ వార్త

తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

మంగళవారం | 9-6-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 697 పేజీలు: 4 వెల : రూ.7

# పథకం ప్రకారమే.. హత్య





* భార్య, కొడుకు, అల్లుడు చేతిలో హతమైన అసిరి నాయుడు
* నేరం తనపై వేసుకునేందుకు సిద్ధమైన భార్య
* కేసును చేదించిన రెండో పట్టణ సీఐ ఈశ్వరరావు
* ముగ్గురిని అరెస్టు చేసిన పోలీసులు
* వివరాలు వెల్లడించిన డీఎస్పీ వివేకానంద

శ్రీకాకుళం క్రైం, జూన్ 8 (వార్త): భర్త వేధింపులు తాళలేక భార్య.. తన కొడుకు, అల్లుడుతో కలిసి భర్తను ఒక పథకం ప్రకారం హత్య చేసింది. ముందుగా రచించుకున్న పథకం ప్రకారం ముగ్గురు కలిసి అసిరి నాయుడుని హత్య చేయడంతో పాటు ఆ హత్యను తనపై వేసుకునేందుకు సిద్ధమైంది.. మృతుని భార్య. పోలీసులు తమదైన శైలిలో విచారణ చేపట్టి హత్య చేసిన ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ సీహెచ్ వివేకానంద మీడియాకు సోమవారం వివరించారు. శ్రీకాకుళం నగరం ప్రకాష్ నగర్ కాలనీకి చెందిన ధర్మాన అసిరి నాయుడు కారు డ్రైవర్. మద్యానికి బానిసైన అసిరి నాయుడు ఇంటికి డబ్బులు ఇవ్వకపోగా, అతని భార్య విజయలక్ష్మి హోటల్‌లో పనిచేస్తూ తెచ్చుకున్న డబ్బుని సైతం లాగేసుకునేవాడు. డబ్బులు ఇవ్వకుంటే విజయలక్ష్మిపై దుర్భాషలాడుతూ తీవ్రంగా దాడి చేస్తూ ఇంట్లో వస్తువులు సైతం ధ్వంసం చేసేవాడు. కొన్ని సంవత్సరాలుగా భర్త వేధింపులు తాళలేక విజయలక్ష్మి కొడుకు మణికంఠ, అల్లుడు చల్ల రాజులతో కలిసి భర్త అసిరినాయుడును చంపేందుకు ఈ నెల 3న పథకం రచించింది. అందులో భాగంగానే ఈ నెల నాలుగో తేదీన 7.30 గంటల సమయంలో భర్తకు ఫోన్ చేసి ఇంటికి రావాలని నీతో మాట్లాడాలని విజయలక్ష్మి చెప్పింది. అసిరి నాయుడు ఇంటికి చేరుకోగా ఇద్దరు మాట్లాడుతుండగా వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో విజయలక్ష్మి కర్రతో భర్త తలపై గట్టిగా మోదింది. అప్పటికే మేడపై వేచి ఉన్న కొడుకు, అల్లుడు కిందికి దిగి అసిరినాయుడును కర్రలతో కొట్టారు. భార్య విజయలక్ష్మి కత్తిపీటతో అసిరినాయుడు శరీరంపై గాయపరిచింది. పథకం ప్రకారం అల్లుడు ముందుగా తెచ్చిన పురుగుల మందు అసిరినాయుడు నోటిలో పోయగా, భార్యా గట్టిగా నోరునొక్కగా అల్లుడు, కొడుకు కాళ్లు పట్టుకొని కదలకుండా చేశారు. ఇంకా ప్రాణాలతో ఉన్నాడేమో అన్న అనుమానంతో మరలా అసిరినాయుడు మెడకు చీర కట్టి ముగ్గురు గట్టిగా లాగారు. అసిరి నాయుడు మృతి చెందాడని నిర్ధారించుకున్నారు. ఆ హత్య నేరం తనపై వేసుకుంటానని విజయలక్ష్మి చెప్పడంతో, కొద్దిసేపటి తర్వాత కొడుకు మణికంఠ 112 కు ఫోన్ చేసి తన తండ్రి రక్తపు గాయాలతో పడి ఉన్నాడని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేయగా తాను స్విగ్గిలో పనిచేస్తున్నానని రాత్రి డ్యూటీ ముగించుకుని ఇంటికి వచ్చేసరికి తన తండ్రి రక్తపు గాయాలతో పడి ఉన్నాడని, తన తల్లి హత్య చేసిందని మణికంఠ పోలీసులకు నమ్మబలికాడనీ డీఎస్పీ చెప్పారు. రెండో పట్టణ సీఐ ఈశ్వరరావు మృతుడి అల్లుడిని విచారణకు పిలవగా హాజరయ్యారు. కొడుకు మణికంఠను విచారణకు పిలువగా హాజరు కాకపోవడంతో అనుమానం వచ్చిన సీఐ, తనదైన శైలిలో విచారణ చేయగా హత్యకు గల కారణాలను బయటపడ్డాయని డీఎస్పీ తెలిపారు. సోమవారం ఉదయం నిందితురాలు విజయలక్ష్మి స్థానిక వీఆర్వో వద్ద లొంగిపోవడంతో పోలీసులు ముగ్గురిని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ తరలించారు. మంగళవారం కోర్టులో హాజరు పరచనున్నట్టు డీఎస్పీ వివేకానంద వెల్లడించారు. కేసును త్వరితగతంగా ఛేదించిన సీఐ ఈశ్వరరావును, ఎస్సై చంద్రకళను అభినందించారు. ఈ విలేకరుల సమావేశంలో డీఎస్పీతో పాటు సీఐ ఈశ్వరరావు పాల్గొన్నారు.






* పెరుగుతున్న పగటి ఉష్ణోగ్రతలు
* పలు మండలాల్లో తీవ్ర వడగాలులు
* 40 డిగ్రీలకుపైగానే ఉష్ణోగ్రతలు నమోదు
* ఉక్కిరిబిక్కిరి అవుతున్న చిన్నారులు, వృద్ధులు
* నిర్మానుష్యంగా మారుతున్న రహదారులు

# మండే!

శ్రీకాకుళం, జూన్ 8 (వార్త):: రోజురోజుకూ పెరుగుతున్న తీవ్ర ఎండలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం ఏడు గంటల నుంచే మండిపోతున్న ఎండల కారణంగా ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి భయపడుతున్నారు. మధ్యాహ్న సమయాల్లో రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఉష్ణోగ్రతలు 40 నుండి 45 డిగ్రీల వరకు నమోదవుతుండడం, వడగాలులు వీస్తుండడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. రాత్రివేళ ఉక్కపోతకు ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ప్రత్యేకంగా చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణీలు, కూలీలు, కార్మికులు ఎండలకు తాళలేక సతమతమవుతున్నారు. తీవ్ర ఎండల కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య మరింత పెరిగింది. బోర్లు ఎండిపోవడం, నీటి సరఫరా సరిగా లేకపోవడం వల్ల ప్రజలు మంచినీటి కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. పట్టణ ప్రాంతాల్లో కూడా చల్లని నీరు, శీతల పానీయాలకు భారీగా డిమాండ్ పెరిగింది. మరోవైపు ఎండల తీవ్రతతో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగింది. ఫ్యాన్లు, కూలర్లు, ఎయిర్ కండిషనర్లు అధికంగా వినియోగించడంతో కొన్నిచోట్ల విద్యుత్ లోడ్ పెరిగి అంతరాయాలు ఏర్పడుతున్నాయి. విద్యుత్ కోతలతో ప్రజలు మరింత ఇబ్బందులు పడుతున్నారు. వడదెబ్బకు గురైన వారితో ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. వైద్య నిపుణులు ప్రజలకు పలు సూచనలు చేస్తున్నారు. అత్యవసరం అయితే తప్ప మధ్యాహ్నం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయటకు వెళ్లవద్దని హెచ్చరిస్తున్నారు. తగినంత నీరు తాగడం, మజ్జిగ, కొబ్బరి నీరు వంటి ద్రవ పదార్థాలు తీసుకోవడం, పలుచటి దుస్తులు ధరించడం, చిన్నపిల్లలు మరియు వృద్ధుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించడం అవసరమని సూచిస్తున్నారు.తీవ్ర ఎండల నేపథ్యంలో ప్రభుత్వం ప్రజలకు ఉపశమనం కలిగించే చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ప్రధాన రహదారులు, బస్టాండ్లు, మార్కెట్ ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయడం, తాగునీటి సదుపాయాలు కల్పించడం, గ్రామీణ ప్రాంతాల్లో నీటి సరఫరాను మెరుగుపరచడం వంటి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండి ఆరోగ్య పరిరక్షణ చర్యలు పాటిస్తేనే ఎండల ప్రభావం నుంచి రక్షణ పొందగలరని నిపుణులు సూచిస్తున్నారు.



సైకిల్‌పై.. గ్రీవెన్స్‌కు..

# కలెక్టర్, జేసీ

* 'మీకోసం' వేదికకు.. వినూత్న ప్రయాణం
* ప్రతి సోమవారం సైకిళ్లపై గ్రీవెన్స్‌కు రావాలి
* ఫిట్ ఇండియాను స్ఫూర్తిగా తీసుకోవాలి
* అధికారులు, సిబ్బందికి సూచించిన కలెక్టర్

శ్రీకాకుళం, జూన్ 8 (వార్త): భవిష్యత్తు తరాలకు మంచి పర్యావరణాన్ని అందించడంతో పాటు, శారీరక దృఢత్వానికి సైకిల్ తొక్కడం ఎంతో అవసరమని, ప్రతి సోమవారం 'మీకోసం' గ్రీవెన్స్ డే రోజున జిల్లా అధికారులు అందరూ సైకిళ్లపై రావాలని శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. సోమవారం ఉదయం జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ఇద్దరూ స్వయంగా సైకిళ్లు తొక్కుకుంటూ జిల్లా పరిషత్ కార్యాలయానికి చేరుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నగర పరిధిలో అధికారులు రెండు మూడు కిలోమీటర్ల మేర సైకిల్ తొక్కడం వల్ల చక్కని శారీరక శ్రమ కలిగి ఆరోగ్యం చేకూరుతుందన్నారు. వాహనాల్లో వెళ్లేటప్పుడు గమనించలేని మన చుట్టూ ఉన్న పరిసరాలను, క్షేత్రస్థాయి పరిస్థితులను స్వయంగా కళ్లారా చూసే అవకాశం ఈ ప్రయాణం ద్వారా కలుగుతుందని పేర్కొన్నారు. ఒకే మార్గంలో వివిధ శాఖల అధికారులు కలిసి సైకిళ్లపై ప్రయాణించడం వల్ల పరస్పర సమన్వయం పెరుగుతుందని, ఇది ఆయా శాఖల మధ్య సమన్వయంతో పనులు వేగంగా సాగడానికి దోహదపడుతుందని వివరించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపునిచ్చిన 'ఫిట్ ఇండియా'ను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని.. అలాగే ఇటీవల విశాఖపట్నంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్వయంగా సైకిల్ తొక్కి ఇచ్చిన సందేశాన్ని ఎవరూ మర్చిపోకూడదని గుర్తుచేశారు. ఇప్పటికే సైకిళ్లపై కార్యాలయానికి చేరుకున్న అధికారులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. సైకిళ్లు అందుబాటులో లేని వారు లేదా సైకిల్ తొక్కడంలో ఇబ్బందులు ఉన్నవారు.. కనీసం ఈ-బైక్‌లను వినియోగించాలని సూచించారు. అధికారులు అంతా ఇదే బాటలో నడిచి ఆదర్శంగా నిలవాలని కలెక్టర్ ఆకాంక్షించారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## 'మార్పు'నకు ఘన సన్మానం

**మందస, జూన్ 8(వార్త):** మార్పు జగన్మోహనరావుకు రాజమహేంద్రవరంలో ఘన సన్మానం జరిగింది. తెలుగు భాషాభివృద్ధికి జగన్మోహనరావు చేస్తున్న కృషిని గుర్తించి, ఈ సన్మానం చేశారు. ప్రజా విజ్ఞాన వేదిక మందస మండలం కన్వీనర్ మార్పు జగన్మోహనరావుకు చైతన్య సారస్వత పరిషత్, శ్రీశ్రీ కళావేదిక సంయుక్తంగా రాజమహేంద్రవరంలో నిర్వహించిన 7వ ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభలలో జరుగుతున్న కార్యక్రమాలకు జగన్మోహనరావుకు నిర్వాహకులు ఆహ్వానం పలికారు. కార్యక్రమానికి హాజరైన ఆయన తెలుగు భాష విలువ, తియ్యదనం, గొప్పతనం వర్ణిస్తూ పద్యకవితను రాశి ఆలాపించారు. ఆయన కవిత్వాన్ని గుర్తించిన సంస్థ ప్రతినిధులు దుశ్శాలువాతో సత్కరించి, మెమెంటో, సర్టిఫికెట్ ను ఇచ్చి పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఆయనకు జరిగిన సన్మానాన్ని గుర్తించిన గ్రామ ప్రజలు, కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు అభినందించి, హర్షం వ్యక్తం చేశారు.



# కూటమి వైఫల్యాలపై .. నిరసన గళం

### -పలాస టౌన్ హాల్ సదస్సులో తీవ్రంగా విమర్శించిన రైతులు, మహిళలు, గిరిజనులు, దళితులు, ప్రజా సంఘాలు



**పలాస, జూన్ 8(వార్త):** కార్గో ఎయిర్‌పోర్ట్‌నకు సారవంతమైన భూముల సేకరణను విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ పలాస–కాశీబుగ్గలో మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన టౌన్ హాల్ సదస్సు విజయవంతమైంది. పలాస నియోజకవర్గంలోని వివిధ వర్గాలకు చెందిన నాయకులు, రైతు సంఘాల ప్రతినిధులు, మహిళా నాయకులు, గిరిజన సంఘాల ప్రతినిధులు, దళిత నాయకులు, ప్రజా సంఘాల సభ్యులు, మేధావులు, మీడియా ప్రతినిధులు పాల్గొని రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక సమస్యలు, కార్గో ఎయిర్‌పోర్ట్ అంశాలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు హనుమంతు వెంకటరావుదొర మాట్లాడుతూ వైఎస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి సమాంతరంగా కొనసాగాయన్నారు. రైతులు, మహిళలు, విద్యార్థులు, ఉద్యోగులు, చిన్న వ్యాపారులు, సామాన్య ప్రజలు ప్రభుత్వ పథకాల ద్వారా ప్రత్యక్షంగా లబ్ధి పొందారని గుర్తుచేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు కాకపోవడంతో నిరాశ నెలకొందన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వైద్య సేవలు కూడా సామాన్య ప్రజలకు అందుబాటులో లేకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కక్షసాధింపు రాజకీయాలు మినహా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల విషయంలో ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదని విమర్శించారు. గతంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను చూపిస్తూ ప్రస్తుత పాలకులు ప్రచారం చేసుకోవడం తప్ప కొత్తగా చేసిన అభివృద్ధి ఏమీలేదని ఎద్దేవా చేశారు. పలాస నియోజకవర్గంలో కూడా ప్రజలు ఆశించిన మార్పు కనిపించడం లేదని, స్థానిక సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. వజ్రపుకొత్తూరు మండలానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రచార విభాగం అధ్యక్షుడు రత్నాల భీమారావు మాట్లాడుతూ కార్గో ఎయిర్‌పోర్ట్ పేరుతో మెట్టూరు, రాంపురం, చీపురుపల్లి, బేతాళపురం తదితర ప్రాంతాల్లో సుమారు 1500 ఎకరాల సారవంతమైన వ్యవసాయ భూములను రైతుల అభిప్రాయాలు తీసుకోకుండా సేకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. తరతరాలుగా వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్న కుటుంబాలకు ఈ భూములే జీవనాధారమని, భూములు కోల్పోతే వేలాది కుటుంబాలు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ఎయిర్‌పోర్ట్ నిర్మాణం వల్ల స్థానిక ప్రజలకు కలిగే ప్రయోజనాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వకుండా భూములు సేకరించడం అన్యాయమన్నారు. రైతులు, ప్రజా సంఘాలు సూచిస్తున్నట్లుగా ప్రత్యామ్నాయ ప్రాంతాలను పరిశీలించి అక్కడ నిర్మాణం చేపట్టాలని కోరారు. పలాస నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు సుజాత పండా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళల భద్రత ప్రశ్నార్థకంగా మారిందని ఆరోపించారు. మహిళలపై దాడులు, వేధింపులు, నేరాలు పెరుగుతున్నప్పటికీ ప్రభుత్వం సమర్థవంతమైన చర్యలు తీసుకోవడం లేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మద్యం విక్రయాలు నియంత్రణ లేకుండా సాగుతున్నాయని, అధిక ధరలకు విక్రయాలతో పాటు అదనపు వసూళ్లు కూడా జరుగుతున్నాయని విమర్శించారు. బడి, గుడి, గ్రామాల పరిసర ప్రాంతాల్లో కూడా మద్యం అందుబాటులో ఉండటం వల్ల యువత భవిష్యత్తు ప్రమాదంలో పడుతోందన్నారు. మహిళలకు సంవత్సరానికి రూ.15,000 ఇస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. మహిళా సంక్షేమం విషయంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. సీనియర్ పాత్రికేయుడు మహారణ మాట్లాడుతూ రైతులకు సాగునీటి సమస్యలు రోజురోజుకు తీవ్రమవుతున్నాయన్నారు. ఆఫ్‌షోర్ రిజర్వాయర్ సహా అనేక సాగునీటి ప్రాజెక్టుల విషయంలో స్పష్టత లేకపోవడం రైతులను ఆందోళనకు గురిచేస్తోందన్నారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తున్న మీడియాపై కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. మీడియా ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తుందని, ప్రజల గొంతుకగా నిలుస్తుందని చెప్పారు. కార్గో ఎయిర్‌పోర్ట్ వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షుడు కోమర వాసు మాట్లాడుతూ 2024 నవంబర్ 9వ తేదీన కార్గో ఎయిర్‌పోర్ట్ ప్రతిపాదన వెలుగులోకి వచ్చిన నాటి నుండి ఉద్దానం ప్రాంత ప్రజలు ఉద్యమం ప్రారంభించారని తెలిపారు. రైతులు, ప్రజా సంఘాల నాయకులు, ఉద్యమకారులపై కేసులు నమోదు చేసి ఉద్యమాన్ని అణచివేయాలని ప్రయత్నించినప్పటికీ ప్రజలు వెనక్కి తగ్గలేదన్నారు. పచ్చని వ్యవసాయ భూములు నాశనం కాకుండా కాపాడుకోవడమే తమ లక్ష్యమని, రైతుల జీవనాధారాన్ని కాపాడుకునేందుకు చివరి వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ప్రజల అభిప్రాయాలను గౌరవించకుండా ప్రభుత్వం ముందుకు సాగితే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు సవర నీలకంఠం మాట్లాడుతూ మందస మండలంలో వేలాది గిరిజన కుటుంబాలు నివసిస్తున్నప్పటికీ వారి సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. గతంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో వేలాది మంది గిరిజనులకు భూ హక్కుల పట్టాలు పంపిణీ చేశారని, గృహాలు, రహదారులు, విద్యా సదుపాయాలు కల్పించారని గుర్తుచేశారు. ప్రస్తుతం గిరిజనుల సంక్షేమం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని ఆరోపించారు. ఆదివాసీ వికాస్ పరిషత్ నాయకుడు సవర జగన్ మాట్లాడుతూ గిరిజన రైతులకు సాగునీరు, రహదారులు, మౌలిక వసతులు ఇప్పటికీ అందుబాటులో లేవన్నారు. గత ప్రభుత్వంలో గిరిజనుల అభివృద్ధికి చర్యలు తీసుకోగా, ప్రస్తుత ప్రభుత్వం ఆ కార్యక్రమాలను కొనసాగించడంలో విఫలమైందని విమర్శించారు. మందసలో గిరిజన భవనం నిర్మాణం ఇప్పటికీ పూర్తి కాకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు వాయిలపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ దళితుల సంక్షేమం విషయంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫల మైందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ఘటనలు పెరుగుతున్నాయని, పలాస నియోజకవర్గంలో కూడా దళితులపై వివక్ష, వేధింపులు పెరిగాయని ఆరోపించారు. దళితుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, అన్యాయాలకు వ్యతిరేకంగా దళిత సమాజం సంఘటితంగా పోరాడుతుందని తెలిపారు. ఈ టౌన్ హాల్ సదస్సులో పాల్గొన్న వివిధ వర్గాల ప్రతినిధులు ప్రజా సమస్యల పరిష్కారం, రైతుల భూముల పరిరక్షణ, కార్గో ఎయిర్‌పోర్ట్ కోసం ప్రత్యామ్నాయ స్థలాల పరిశీలన, మహిళల భద్రత, గిరిజన, దళిత సంక్షేమం, వైద్య, విద్యా సదుపాయాల మెరుగుదల కోసం ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రజల హక్కుల పరిరక్షణ కోసం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.





## వ్యవసాయాభివృద్ధికి చెక్‌డ్యామ్‌లు కీలకం



**కొత్తూరు, జూన్ 8(వార్త):** కర్లెమ్మ గ్రామం నేతాజీ నగర్ కాలనీ సమీపంలోని హడ్డుబంగి గడ్డపై నిర్మించిన చెక్‌డ్యామ్‌ను పాతపట్నం ఎమ్మెల్యే, అసెంబ్లీ ప్రివిలేజ్ కమిటీ సభ్యులు మామిడి గోవిందరావు (ఎంజీఆర్) ఘనంగా ప్రారంభించారు. ఎన్నో ఏళ్లుగా స్థానిక రైతులు ఎదురుచూస్తున్న ఈ చెక్‌డ్యామ్ నిర్మాణం పూర్తవడంతో గ్రామ ప్రజలు, రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎంజీఆర్ మాట్లాడుతూ రైతులకు శాశ్వత సాగునీటి భరోసా కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. వర్షపు నీటిని నిల్వ చేసేందుకు చెక్‌డ్యామ్‌లు కీలకమని, వీటి ద్వారా భూగర్భ జలాలు పెరిగి బోర్లు, బావుల్లో నీటి మట్టాలు మెరుగుపడతాయని తెలిపారు. నీటి సంరక్షణతో వ్యవసాయ రంగం బలోపేతం అవుతుందని, రైతుల ఆదాయం పెరగడానికి ఇది దోహదపడుతుందన్నారు. వ్యవసాయమే గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అని పేర్కొన్న ఎమ్మెల్యే , రైతు సంక్షేమమే ఎన్డీఏ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు. రైతులకు అవసరమైన సాగునీటి వనరులు, మౌలిక సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతతో పనిచేస్తోందన్నారు. ప్రతి చుక్క నీటిని సద్వినియోగం చేసుకుంటూ వ్యవసాయ రంగాన్ని మరింత అభివృద్ధి చేయడమే తమ సంకల్పమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తేదేపా అధ్యక్షుడు అగతముడి మాధవరావు, సీనియర్ నాయకులు లోతుగడ్డ తులసీ వరప్రసాద్ నాయుడు, అగతముడి అరుణ్ బాబు, మాతల గాంధీ, ఏ వన్ కాంట్రాక్టర్ పొగిరి అర్జునరావు, పొగిరి వినోద్ కుమార్, లోతుగడ్డ భగవాన్ నాయుడు, లోతుగడ్డ లక్ష్మీనారాయణ, గోగుల చిట్టి నాయుడు,ఎన్డీఏ కూటమి నాయకులు, కర్లెమ్మ నీటి సంఘం డైరెక్టర్లు, కొత్తూరు, కుంటిభద్ర, సిరుసువాడ, మహార్తాపురం గ్రామాల రైతులు, గ్రామస్తులు, అధికారులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నవచేతనతో చిన్నారుల సమగ్రాభివృద్ధి

### - మందస సీడీపీఓ అరుణ

### -అంగన్‌వాడీలకు మందసలో ముగిసిన శిక్షణా శిబిరం




**మందస, జూన్ 8(వార్త):** నవచేతన కార్యక్రమంతో చిన్నారుల సమగ్ర అభివృద్ధి జరుగుతుందని ఐసీడీఎస్ మందస ప్రాజెక్టు అధికారి పెద్దింటి అరుణ అన్నారు. మందస పట్టణంలోని శ్రీరాజా శ్రీనివాస స్మారక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం నవచేతన ముగింపు కార్యక్రమాన్ని ఉద్దేశించి సీడీపీఓ పి.అరుణ మాట్లాడుతూ ప్రతీ పిల్లవాడి సమగ్ర అభివృద్ధి రాష్ట్ర భవిష్యత్తుకు పునాది అనే దృక్పథంతో ముఖ్యమంత్రి బాల్యారంభ సంరక్షణను ప్రభుత్వ ప్రాధాన్యతా అంశంగా గుర్తించారన్నారు. దీనిలో భాగంగా నవచేతన అనేది కార్యక్రమం 0 నుండి 6సంవత్సరాల పిల్లల అభివృద్ధిని ప్రారంభ దశలోనే అంచనా వేయడానికి రూపొందించిన మొబైల్ ఆధారిత డిజిటల్ అభివృద్ధి స్క్రీనింగ్ కార్యక్రమమే నవచేతన అన్నారు.

మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అమలు చేయబడుతున్న ఈ కార్యక్రమం అంగన్‌వాడీ కార్యకర్తలకు శాస్త్రీయ, ప్రమాణీకృత స్క్రీనింగ్ సాధనాన్ని అందిస్తుందన్నారు. కార్యక్రమం ద్వారా ప్రతీ పిల్లవాడి అభివృద్ధి పురోగతిని క్రమబద్ధంగా పరిశీలించి, ప్రత్యేక శ్రద్ధ అవసరమైన పిల్లలను ప్రారంభ దశలోనే గుర్తించవచ్చన్నారు. నవచేతన యాప్ ద్వారా పిల్లల అభివృద్ధిని కింది ఐదు ప్రధాన విభాగాలలో అంచనా వేస్తారని, స్థూల చలన నైపుణ్యాలు, సూక్ష్మ చలన నైపుణ్యాలు, భాషా అభివృద్ధి, జ్ఞానాత్మక అభివృద్ధి, సామాజిక -- భావోద్వేగ అభివృద్ధి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంఎల్ పీహెచ్ లు ఎం.ఢిల్లీశ్వరి, సీహెచ్ ఉత్తరకుమారి, సూపర్ వైజర్లు సీహెచ్.వి.రామలక్ష్మి, పి.జయలక్ష్మి, జె.లక్ష్మి, అంగన్ వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## దేశంలో కొత్త క్రిమినల్ చట్టాలు

### -కాశీబుగ్గ ఎస్ఐ ఆర్ నరసింహమూర్తి

### -భారతీయ నాగరిక సురక్ష సంహితపై అవగాహన

**పలాస, జూన్ 8(వార్త):** భారతదేశంలో కొత్త క్రిమినల్ చట్టాలు వచ్చేసాయని, ప్రతి ఒక్కరూ కొత్త చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని కాశీబుగ్గ ఎస్ ఐ ఆర్ నరసింహమూర్తి తెలిపారు. సోమవారం టెక్కలిపట్నం గ్రామాన్ని సందర్శించి, నూతన క్రిమినల్ చట్టాలైన భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్ష సంహితపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ పౌరుల హక్కులు, బాధ్యతలు, చట్టాల అమలు విధానాల గురించి వివరించారు. భారతదేశంలో కొత్త క్రిమినల్ చట్టాలైన బి ఎన్ ఎస్ ఎస్ 2024 జూలై 1 నుండి అమల్లోకి వచ్చాయని, ఇవి వరుసగా పాత ఐపీసీ, సీ ఆర్ పీసీ స్థానంలో వచ్చాయని, భారతీయ న్యాయ సంహిత నేరం ఏమిటి, దానికి ఏ శిక్ష ఉంటుందో నిర్వచించే నేరాల చట్టమని వివరించారు. ఇది ఐపీసీకి బదులుగా వచ్చి, హత్య, దొంగతనం, మోసం, మహిళలపై నేరాలు, ఉగ్రవాదం, సంఘటిత నేరాలు వంటి అంశాలను కవర్ చేస్తుందని అన్నారు. భారతీయ నాగరిక సురక్ష సంహిత కేసు ఎలా నడుస్తుందో చెప్పే ప్రక్రియల చట్టం గూర్చి వివరించారు. ఇందులో ఫైర్, అరెస్ట్, దర్యాప్తు, రిమాండ్, బెయిల్, ట్రయల్, అప్పీల్ వంటి క్రిమినల్ ప్రాసెస్ నిబంధనలు ఉంటాయని తెలిపారు. "ఏ నేరం జరిగింది? శిక్ష ఏమిటి?" అని, "ఆ నేర కేసు ఎలా విచారణకు వస్తుందో వివరంగా తెలిపారు. ఒక వ్యక్తి దొంగతనం చేస్తే, ఆ నేర నిర్వచనం, శిక్ష బిఎన్ ఎస్ లో ఉంటుందో వివరిస్తూ ఆ కేసులో ఫైర్ నమోదు నుంచి కోర్టు విచారణ వరకు ప్రక్రియ బి ఎన్ ఎస్ ఎస్ ప్రకారం జరుగుతుందని తెలిపారు. ఈ కొత్త చట్టాలు వలసకాలపు పేర్లను తొలగించి, డిజిటల్ దర్యాప్తు, సమయపాలన, బాధితుల హక్కుల బలోపేతం వంటి లక్ష్యాలతో తీసుకొచ్చారని చెప్పారు. ఈ సమావేశంలో కాశిబుగ్గ పోలీసులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.




## యోగాతో ఆరోగ్యానికి భరోసా

### - ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమాల నిర్వహణ

### - ప్రభుత్వ ఉద్యోగులు కూడా పాల్గొనాలని పిలుపు

**నరసన్నపేట, జూన్ 8 (వార్త):** ప్రపంచ యోగ దినోత్సవాన్ని పురస్కరించుకుని యోగా పట్ల ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆయుష్ వైద్యాధికారి సీతామహాలక్ష్మి తెలిపారు. సోమవారం నరసన్నపేట మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న యోగా శిక్షణా కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నేటి నుంచి ఈ నెల 19వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని చెప్పారు. శారీరక, మానసిక ఆరోగ్య పరిరక్షణలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుత కాలంలో ఒత్తిడి, అనారోగ్య సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ యోగాను దినచర్యలో భాగం చేసుకోవాలని సూచించారు. యోగా ద్వారా శరీరానికి చురుకుదనం, మానసిక ప్రశాంతత లభిస్తాయని వివరించారు. ప్రభుత్వ ఉద్యోగులు, యువత, మహిళలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఈ శిక్షణా తరగతుల్లో పాల్గొని యోగా ప్రయోజనాలను తెలుసుకోవాలని ఆమె కోరారు. ప్రపంచ యోగ దినోత్సవాన్ని విజయవంతం చేసేందుకు అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ శాఖ సిబ్బంది, యోగా శిక్షకులు, పాల్గొనేవారు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## నీటి ఎద్దడి నివారణకు బోర్లకు మరమ్మతులు

**జి.సిగడాం, జూన్ 8(వార్త):** గ్రామాల అభివృద్ధి ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని పెంట గ్రామ నీటి సంఘం అధ్యక్షురాలు మీసాల విజయమ్మ అన్నారు. ఇటీవల బోర్లు పనిచేయడం లేదని నారాయణ రావు దృష్టికి ప్రజలు తీసుకొని వెళ్లారు. వారు చొరవతో అదికారులతో మాట్లాడారు. అదికారులు స్పందిస్తూ సోమవారం పెంట గ్రామంలో పలు చోట్లలలో ఉన్న బోర్డులను స్థానిక నాయకులు మక్క నారాయణ ఆద్వర్యంలో మరమత్తు పనులు చేపట్టారు. గ్రామంలో పలువురు అభినందనలు వారికి తెలిపారు. అనంతరం గ్రామ సచివాలయంలో పంచాయితీ కార్యదర్శి అల్లాడ దుర్గారావుతో మాట్లాతూ గ్రామంలో ప్రజలకు త్రాగునీరు సౌకర్యాలు, వీదివీధుల్లో పారిశుద్ధ్యం మెరుగుపడేలా చూడాలని మంచినీటి బావిల్లో ఎప్పటికప్పుడు క్లోరినేషన్, దోమలు వ్యాప్తిచెందకుండా ఫాగింగ్ నిర్వహించాలన్నారు. ఏదైన సమస్యలు ఉంటే సమన్వయంతో కలిసి పని చేసుకొని పరిష్కరించుకొనేలా ఉద్యోగ విధులను నిర్వర్తించేలా ఉండాలన్నారు.



# జగన్‌కి హారిజంటల్ రిజర్వేషన్ తెలియదు

**- పదేళ్లలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఏం చేశారు?**


**- వైస్సార్సీపీ పాలనలో ఏ పనైనా చేశారా?**

**- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అశోక్ ధ్వజం**

**ఇచ్ఛాపురం, జూన్ 8(వార్త) :** గత పదేళ్లలో ఇచ్ఛాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ చేసిన అభివృద్ధి పని ఒక్కటైన ఉందా.. వైస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో మున్సిపల్ అభివృద్ధికి గుర్తుండిపోయేలా ఒక్క పనైనా పూర్తి చేశారా అంటూ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బెందాళం అశోక్ ధ్వజమెత్తారు. రైతులకు అండగా కూటమి ప్రభుత్వం ఉందని, అధికారంలోకి వచ్చిన రెండేళ్లల్లో మున్సిపాల్టీ, మండలాలలో అనేక పనులు చేపట్టి అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో రైతులకు 2 ట్రాక్టర్లును. 21 పంచాయతీలకు 21 చెత్త సేకరణ రిక్షాలను అందజేశారు. అనంతరం కార్యాలయంలో విలేఖర్ల సమావేశంలో మాట్లాడుతూ గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా మున్సిపాల్టీ ఎటువంటి అభవృద్ధికి నోచుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాతనే అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. డి గ్రేడ్లో ఉన్న మున్సిపాల్టీలో తాగునీరు బ్యూటిఫికేషన్ లేనటు వంటి పరిస్థితి నుంచి సుడా, అమృత్ 2.0 పథకాలు ద్వారా అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశామన్నారు. పురుషోత్తపురం వద్ద అంతరాష్ట్ర గేట్ ఉన్నపుడు మున్సిపాల్టీకి మంచి ఫండింగ్ బాగుండేదని, అప్పుడు అనేక కార్యక్రమాలు చేయటం జరిగిందని. జీఎస్టీ అమలు లోకి వచ్చిన తరువాత అంతర్రాష్ట్రగేటు ఎత్తివేయటంతో మున్సిపాల్టీకి కనీసం జనరల్ ఫండ్ కూడా అవకాశం లేకుండా పోయిందని. మున్సిపాల్టీకి త్రాగునీటి సమస్య తీవ్రంగా ఉందని మున్సిపాల్టీ ఏర్పడినప్పటి నుంచి నేటి వరకు 1,2, 3 వార్డులతోపాటు బెల్లుపడ, రత్తకన్న కొండపోలమ్మ కాలనీ వార్డులు కనీసం రూరల్‌లో ఉన్న డెవలప్ మెంట్ కి కూడా నోచుకోని పరిస్థితి నెలకొందని ఈ సమస్యలను గుర్తించిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినతరువాత అందరికీ మంచినీటి సౌకర్యం కల్పించాలని బెల్లుపడ కొఠేరు బందకు రూ1.41కోట్లుతో బ్యూటిఫికేషన్, బండ్ అభివృద్ధికి అమృత్ 2.0 నుంచి తీసుకురావటం జరిగిందని. రత్తకన్న లో ఎన్ఎస్టీపీ సైట్ కింద (స్వచ్ఛభారత్ మిషన్) రూ1.45కోట్లుతో, రూ2.02కోట్లుతో డంపింగ్ యార్డ్ పనులు, పురుషోత్తపురంలో ఏఐఐబి ఫండ్ రూ60.03కోట్లుతో, అమృత్ 2.0 కింద రూ4.98కోట్లతో హౌసింగ్ కాలనీలో పనులకు శంకుస్థాపన చేశామని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. సెంటర్ లైటింగ్ విషయంలో కాస్తజాప్యం జరిగిందన్నారు. ప్రతిపక్ష నాయకులు తప్పుడు విమర్శలను మానుకోవాలని అన్నారు. వైసీపీ నాయకులు కూటమి ప్రభుత్వంపై రెండేళ్లు వెన్నుపోటు పొడిచారని విమర్శలు చేస్తున్నారు. అసలు ప్రజలకు మీరు పొడిచిన వెన్నుపోటుకే 151 నుంచి 11 సీట్లుకు ప్రజలే పడేశారన్నారు. గత 5 ఏళ్లలో ఎందుకు సెంటర్ లైటింగ్ చేసుకోలేకపోయారో చెప్పగలరా అని ప్రశ్నించారు. ఇచ్ఛాపురంలో బ్యూటిఫికేషన్‌కు ఒక్క రూపాయి అయినా ఖర్చు చేశారా అని విమర్శించారు. వైస్సార్సీపీ నాయకులు వైస్ చైర్ పర్సన్ కుర్చీకోసం పోరాటం చేశారే తప్పా అభివృద్ధి పనులపై దృష్టి పెట్టారా అని విమర్శించారు. గవర్నమెంట్ మంజూరు చేసిన డబ్బును ఏరకంగా మున్సిపాల్టీకి మున్సిపాల్టీకి ఉపయోగపడేలా వాడాలే కూడా గత ప్రభుత్వం చేయలేకపోయిందన్నారు. ఏఐఐబి ప్రాజెక్ట్ పూర్తి అయ్యే లోపు తాత్కాలికంగా బోర్లు వేసి తాగునీరందిస్తామని అన్నారు. గత ప్రభుత్వంలో ఒక్క డీఎస్సీ అయినా తీసావా జగన్ అని ప్రశ్నించారు. చెత్తమీద పన్నువేసిన చెత్త ప్రభుత్వం వైసీపీ పార్టీది ట్యాక్సులు వసూల్లు చేసేరే తప్పా ఎక్కడా చెత్తలు క్లీన్ చేశారని అని వైసీపీ నాయకులకు ప్రశ్నించారు. గత 5ఏళ్ల పాలనలో ఏనాడైనా జాబ్‌మేళా విడుదల చేశావా, జగన్ మాయ మాటలు చెప్పి ప్రజలకు మోసం చేశారన్నారు. ఒక్క నిరుద్యోగికైనా ఉద్యోగం కల్పించావా జగన్ అని విమర్శించారు. ఇచ్చిన వాలంటీర్లు వ్యవస్థకు చట్టబద్ధత కూడా కల్పించలేని జగన్ కూటమి ప్రభుత్వం డీఎస్సీ విడుదల చేస్తే మాకు విమర్శిస్తావా అని అన్నారు. డి ఎస్ సి రిజర్వేషన్ లో హారిజంటల్ విధానం అంటే ఏమిటో జగన్ కి తెలుసా అన్నారు. అంతకుముందు రూ60లక్షల సుడా నిధులతో ఏర్పాటు చేసిన సెంటర్ లైటింగ్‌ను ఆయన ప్రారంభించారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేతగాని వల్లే మున్సిపాల్టీ సెంటర్ లైటింగ్ పనులు చేయలేక మున్సిపాల్టీని చీకటి చేసిందని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి పనులు వేగవంతం చేశామన్నారు. మున్సిపాల్టీ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన సెంటర్ లైటింగ్ స్విచ్చు ఆన్చేసి ప్రారంభించారు. ఒక్కసారిగా పట్టపగలే విద్యుత్ లైట్లు వెలగటంతో అంతా ఆనందాలను పంచుకున్నారు. సంతపేట భువనేశ్వరి అవ వారి ఆలయం దగ్గర నుండి దాసన్నపేట జంక్షన్ వరకు సెంటర్‌ంటింగ్ పనులు చేయటం జరిగిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎన్ రమేష్, జనసేన పార్టీ ఇన్‌చార్జి దాసరి రాజు, రాష్ట్ర రెడ్డిక కార్పోరేషన్ చైర్మన్ కొండా శంకర్ రెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు పత్రి తవిటయ్య, ఎన్.కోటి, తెలుగు యువత అధ్యక్షులు కాళ్ల జయదేవ్, మాజీ కౌన్సిలర్లు కాళ్ల దిలీప్, ఆశి లీలారాణి. మాజీ కార్యదర్శి నందికి జాని, ఢిల్లీరావు, సహదేవ్, చిన్న, శేఖర్ జానీ శ్రీను తదితరులు పాల్గొన్నారు.



## వెంకన్నచౌదరితో జనసేన నాయకుల భేటీ



**మందస, జూన్ 8(వార్త):** పలాస నియోజకవర్గ ప్రజా వ్యవహారాలలో చురుకైన పాత్ర పోషిస్తూ, వ్యాపార రంగంలో విజయవంతమైన వ్యాపారవేత్తగా, సామాజిక, రాజకీయ అంశాలపై విశేష అవగాహన కలిగిన ప్రముఖ నాయకుడు యార్లగడ్డ వెంకన్న చౌదరిని పలాస నియోజకవర్గ జనసేన నాయకులు, ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా ప్రచార కమిటీ కోఆర్డినేటర్ కంచరాన అనిల్, జిల్లా కార్యదర్శి మజ్జి భాస్కరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలాస నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, కూటమి పార్టీల సమన్వయం, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు, గ్రామీణాభివృద్ధి, సమకాలీన రాజకీయ పరిస్థితులపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం కావడంతో పాటు, కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు మరింత చేరువయ్యేలా కృషి చేయాల్సిన అవసరంపై అభిప్రాయాలు పంచుకున్నారు. అలాగే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి బలోపేతం కోసం చేపట్టాల్సిన కార్యాచరణపై కూడా చర్చించినట్లు తెలిపారు. యార్లగడ్డ వెంకన్న చౌదరి ఆలోచనా విధానం, ప్రజా సమస్యల పట్ల ఉన్న అవగాహన, అభివృద్ధి పట్ల ఉన్న నిబద్ధత తమను ఆకట్టుకున్నాయని జనసేన నాయకులు పేర్కొన్నారు. ఈ భేటీ ఆత్మీయ వాతావరణంలో జరిగి, పలాస నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై సానుకూల చర్చకు వేదికగా నిలిచిందని తెలిపారు.

## శ్రీముఖలింగం కరకట్ట సీసీ రోడ్డుపై లోకాయుక్త విచారణ

**-నాణ్యత ప్రమాణాలు పాటించలేదంటూ ఆరోపణలు**

**- ఇన్వెస్టిగేషన్ డైరెక్టర్ గోవిందరావు ఆధ్వర్యంలో ప్రాథమిక పరిశీలన**

**జలుమూరు, జూన్ 8(వార్త):** దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీముఖలింగేశ్వర క్షేత్రంలో ఆలయం ఎదురుగా కరకట్టపై నిర్మించిన సీసీ రోడ్డులో నాణ్యత ప్రమాణాలు పాటించలేదన్న ఆరోపణలపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర లోకాయుక్త ఆధ్వర్యంలో ప్రాథమిక విచారణ నిర్వహించారు. లోకాయుక్త ఇన్వెస్టిగేషన్ డైరెక్టర్ గోవిందరావు సమక్షంలో గురువారం కరకట్ట వద్ద ఈ విచారణ చేపట్టారు. జాతీయ ఉపాధి హామీ నిధులతో సుమారు కోటి రూపాయల వ్యయంతో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన ఈ సీసీ రోడ్డును ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్మించారని సామాజిక కార్యకర్త, శ్రీముఖలింగేశ్వర దేవస్థానం అర్చక సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు నాయుడుగారి రాజశేఖర్ ఆరోపించారు.



కరకట్టపై మధ్యలోనే విద్యుత్ స్తంభాలు ఉండటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని, గట్టుకు అవసరమైన బేస్‌మెంట్ లేదా రాక్ ప్యాకింగ్ లేకుండానే రహదారి నిర్మాణం చేపట్టారని పేర్కొన్నారు. 2025 మార్చిలో పనులు పూర్తయ్యాయని, అయితే నిర్మాణంలో జరిగిన అవకతవకలపై గతంలో జిల్లా కలెక్టర్ నుంచి వివిధ స్థాయి ఇంజనీరింగ్ అధికారుల వరకు ఫిర్యాదులు చేసినా స్పందన లభించలేదని తెలిపారు. ఈ నేపథ్యంలో 2026 జనవరిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర లోకాయుక్త జస్టిస్ రజనికి ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. అనంతరం కేసు నెంబర్ 3239/రాశీఎ/2026గా నమోదు చేసి సూపరింటెండెంట్ ఇంజనీర్, డివిజనల్ ఇంజనీర్, జూనియర్ ఇంజనీర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ తదితరులను ప్రతివాదులుగా చేర్చినట్లు సమాచారం. విచారణ సందర్భంగా సంబంధిత నిర్మాణ పనులకు సంబంధించిన పలు ఆధారాలను లోకాయుక్త అధికారులకు సమర్పించినట్లు రాజశేఖర్ తెలిపారు. తదుపరి కర్నూలులోని లోకాయుక్త ప్రధాన కార్యాలయంలో సమగ్ర విచారణ నిర్వహించి సాక్ష్యాధారాలను పరిశీలించనున్నట్లు ఇన్వెస్టిగేషన్ డైరెక్టర్ గోవిందరావు పేర్కొన్నారని చెప్పారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ తమ్మన్నగారి సతీష్ కుమార్, తర బలరాం విచారణ సమయంలో అభ్యంతరకరంగా ప్రవర్తించారని, వారిని ఇన్వెస్టిగేషన్ అధికారి మందలించినట్లు తెలిపారు. ఇది శాఖాపరమైన విషయం కాదని, జ్యుడీషియల్ విచారణకు సంబంధించిన వ్యవహారమని అధికారి స్పష్టం చేసినట్లు పేర్కొన్నారు. ఈ విచారణలో సూపరింటెండెంట్ ఇంజనీర్ రామకృష్ణ, డీఈ సత్యం నాయుడు, జేఈ శ్రీధర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ మణికంఠ, సంబంధిత కాంట్రాక్టర్లు, పోలీస్ సిబ్బంది నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌తోనే రాష్ట్ర, దేశాభివృద్ధి సాధ్యం

**- మాజీ కేంద్ర మంత్రి చింతామోహన్**

**- తిరుపతి భవిష్యత్ రాజధానిగా మారుతుందని వ్యాఖ్య**

**జలుమూరు, జూన్ 8 (వార్త):** జలుమూరు మండలం సైరిగాం గ్రామంలో మాజీ కేంద్ర మంత్రి చింతామోహన్ సోమవారం పర్యటించారు. గ్రామంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన ఆయన అనంతరం హరిజనవాడను సందర్శించి స్థానిక ప్రజల సమస్యలు, జీవన పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం నుంచి అందుతున్న సంక్షేమ పథకాల అమలు తీరుపై గ్రామస్తులతో మాట్లాడారు. ముఖ్యంగా చదువుకున్న యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వ చర్యలపై ఆరా తీశారు. ప్రజలకు సంక్షేమ ఫలాలు పూర్తిస్థాయిలో అందుతున్నాయా అనే అంశంపై స్థానికులతో చర్చించారు. పర్యటన అనంతరం మీడియాతో మాట్లాడిన చింతామోహన్, ఆంధ్రప్రదేశ్‌తో పాటు దేశవ్యాప్తంగా తిరిగి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ప్రజల్లో విశ్వాసం కోల్పోయిందని ఆరోపించారు. పత్రికల్లో మాత్రమే అభివృద్ధి కనిపిస్తోందని, వాస్తవ పరిస్థితుల్లో అభివృద్ధి ఎక్కడా కనిపించడం లేదని విమర్శించారు. దేశం, రాష్ట్ర అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే సాధ్యమైందని పేర్కొన్న ఆయన, భవిష్యత్తులో కూడా కాంగ్రెస్ పార్టీ ద్వారానే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాజధాని అంశంపై కూడా కీలక వ్యాఖ్యలు చేశారు. తిరుపతి భవిష్యత్‌లో రాజధానిగా మారే అవకాశం ఉందని, వీరబ్రహ్మేంద్రస్వామి శతాబ్దాల క్రితం చెప్పిన మాటలు నిజమవుతాయని వ్యాఖ్యానించారు.



అమరావతి ప్రాజెక్టుపై స్పందిస్తూ, భారీ స్థాయిలో లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేయాల్సిన అవసరం లేదని, అంత పెద్ద ఎత్తున భూసేకరణ అవసరం లేదని అభిప్రాయపడ్డారు. విశాఖను ఆర్థిక రాజధానిగా అభివృద్ధి చేయడాన్ని తాను వ్యతిరేకించడం లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## మడపాం టోల్‌ప్లాజా సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

**- లారీ వెనుక చక్రాల కింద పడి ఘటన**

**- మృతుడి గుర్తింపునకు పోలీసుల యత్నాలు**

**నరసన్నపేట, జూన్ 8 (వార్త):** నరసన్నపేట మండలం మడపాం టోల్‌ప్లాజా సమీపంలో ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఉదయం సుమారు 10:48 గంటల సమయంలో ~~ా 27~ 7029 నంబర్ గల లారీ టోల్‌ప్లాజా వైపు వెళ్తుండగా, గుర్తుతెలియని వ్యక్తి అకస్మాత్తుగా లారీ వెనుక చక్రాల కింద పడిపోయాడు. ఈ ఘటనలో అతడు అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ప్రాథమిక విచారణలో మృతుడు ఆత్మహత్యాయత్నం ఉద్దేశంతోనే లారీ చక్రాల కింద పడినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ఎస్ఐ గణేశ్ వెల్లడించారు. మృతుడి వయస్సు సుమారు 35 నుంచి 40 సంవత్సరాల మధ్య ఉండవచ్చని పేర్కొన్నారు. మృతుడు గుండు చేసుకొని ఉండగా, తెలుపు రంగు ప్యాంటు, నీలం రంగు చెక్స్ షర్ట్ ధరించి ఉన్నట్లు గుర్తించారు. కుడి చేతిపై శ్రీ వెంకటేశ్వర స్వామి బొమ్మ గల త్రాడు ఉండగా, బిస్కెట్ రంగు చెప్పులు ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి పూర్తి వివరాలు ఇంకా తెలియరాలేదని, అతడి గుర్తింపునకు చర్యలు చేపట్టామని పోలీసులు వెల్లడించారు. మృతుడిని గుర్తించగలిగిన వారు లేదా అతని కుటుంబ సభ్యుల వివరాలు తెలిసిన వారు నరసన్నపేట పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని కోరారు. సంప్రదించవలసిన ఫోన్ నంబర్లు: 6309990847, 08942-277033. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



## వరి విత్తనాలకు రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

**మెళియాపుట్టి, జూన్ 8(వార్త):** ఖరీఫ్ 20026 కు సంబంధించి మండలంలో 21 రైతు సేవ కేంద్రాలలో 2వేలు క్వింటాల వరి విత్తనాలు పంపిణీకి సిద్ధశీ చేసినట్లు, ప్రతి ఒక రైతు కూడా తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మండల వ్యవసాయధికారి ఎస్.దానకర్ణుడు ఒక ప్రకటనలో తెలిపారు. వరి విత్తనాల అవసరమైన రైతులు విధిగా స్థానిక రైతు సేవా కేంద్రలలో, గ్రామ వ్యవసాయ ఉద్యాన సహాయకుల వద్ద వరి విత్తనాల కొరకు రిజిస్ట్రేషన్ చేసుకుని డబ్బులు చెల్లించి వరి విత్తనాలను పొందాలన్నారు. జనరల్ కేటగిరీ రైతులు బీసీ ఎస్సీ లకు రాయితీల వివరాలు కింది విధముగా ఉన్నాయి. ఎం టి యు1061, 1064, 1121, 1224,1318, 7029 బిపిటి 5204, ఆర్ జి ఎల్ 2537 తదితర వరి విత్తనాలను రైతులకు రాయితీపైన అందించనున్నట్లు తెలియజేశారు. గిరిజన రైతులకు 90 శాతం రాయితీపై వరి విత్తనాలు అందజేయనున్నట్లు వ్యవసాయధికారి తెలిపారు.




## ఆట..పాటల బోధనతో పాఠ్యాంశాలు గుర్తుంటాయి

**- ఎఫ్ఎల్ఎన్ శిక్షణ తరగతుల్లో ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ**

**- శాతం వంద ఫలితాలకు వినూత్న బోధనా విధానాలు దోహదం చేస్తాయి : ఎంఈఓ మాధవరావు**

**నరసన్నపేట, జూన్ 8 (వార్త):** ఆటలు, పాటల రూపంలో పాఠ్యాంశాలను బోధిస్తే విద్యార్థులు సులభంగా అర్థం చేసుకోవడంతో పాటు వాటిని దీర్ఘకాలం గుర్తుంచుకుంటారని జలుమూరు మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) బమ్మిడి మాధవరావు తెలిపారు. సోమవారం నరసన్నపేట ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఎఫ్ఎల్ఎన్ (ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ) శిక్షణా తరగతుల్లో పాల్గొన్న ఆయన ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడారు. చిన్నారుల్లో అభ్యాస నైపుణ్యాలను పెంపొందించేందుకు వినూత్న బోధనా విధానాలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ శిక్షణలో భాగంగా ఉపాధ్యాయులు పాఠ్యాంశాలను పాటల రూపంలో మలచి, ఆటల ద్వారా బోధన చేసే పద్ధతులను అభ్యసిస్తున్నారు. పిల్లల మానసిక స్థితికి అనుగుణంగా సరదాగా బోధిస్తే వారు ఆసక్తిగా నేర్చుకుంటారని, దీంతో శాతం వంద ఫలితాలు సాధించే అవకాశాలు మెండుగా ఉంటాయని మాధవరావు వివరించారు. సాంప్రదాయ బోధనా విధానాలతో పాటు సృజనాత్మక పద్ధతులను అనుసరించడం ద్వారా విద్యార్థుల్లో ఆలోచనా సామర్థ్యం, భాషా నైపుణ్యాలు, గణిత అవగాహన పెరుగుతాయని అన్నారు. ఉపాధ్యాయులు కూడా మారుతున్న కాలానికి అనుగుణంగా బోధనా పద్ధతుల్లో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో జలుమూరు మండలానికి చెందిన ఉపాధ్యాయులు పాల్గొని వివిధ బోధనా పద్ధతులపై అవగాహన పొందారు.



## ప్రత్యేక యాప్ ద్వారా రైతులకు ఎరువులు



**సోంపేట, జూన్ 8(వార్త):** ఖరీఫ్ నుంచి రైతులకు ప్రత్యేకంగా రూపొందించిన యాప్ ఏపీ ఏఐఎంఎస్ ద్వారా రైతులకు అవసరమైన ఎరువులను పంపిణీ చేయనున్నట్లు తహసిల్దారు బిఅప్పలస్వామి, వ్యవసాయ అధికారి బి నరసింహమూర్తి పేర్కొన్నారు. బారువ రైతు సేవ కేంద్రంలో సోమవారం గతంలో వ్యవసాయ పంటలు పండించిన రైతుల వెరిఫికేషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈక్రాప్ లో నమోదైన రైతుల ఆధారంగా వారికి మొబైల్ యాప్ ద్వారా అధికారుల సిఫార్సు మేరకు ఎరువులు అందించనున్నట్లు తెలిపారు. ఈ క్రాప్ నమోదు చేసుకొని రైతులకు మళ్ళీ అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ సహాయకులు రాజేశ్వరి, ప్రియా, వీఆర్వో భగీరధి, పితాంబరం పాల్గొన్నారు.

## గెడ్డలో పడి మతిస్థిమితం లేని వ్యక్తి మృతి

**సంతబొమ్మాళి, జూన్ 8(వార్త):** నౌపడ పంచాయతీ సీతానగరం ముసళ్ళ ఖాన గెడ్డలో పడి మతిస్థిమితం లేని వ్యక్తి సోమవారం మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఎండ తీవ్రతకు రాత్రిపూట గెడ్డలో స్నానానికి దిగి చనిపోవడం జరిగి ఉంటుందని అంటున్నారు. తెల్లారితే నీటిపై మృతదేహం తేలి ఉండడంతో స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానిక వీఆర్వో జోగారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు నౌపడ ఎస్సై నారాయణస్వామి తెలిపారు. పోస్టుమార్టం కోసం టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం






## 'మేమున్నాం' నూతన కార్యవర్గం ఎన్నిక



**సోంపేట, జూన్ 8(వార్త):** సోంపేట కేంద్రంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1987- 88 బ్యాచ్ తో ఏర్పాటైన మేమున్నాం స్వచ్ఛంద సంస్థ నూతన కార్యవర్గ ఎన్నికలు సంఘ గౌరవ అధ్యక్షుడు టీ తరినయ్య ఆధ్వర్యంలో సోమవారం జరిగాయి. ఏకగ్రీవంగా జరిగిన ఈ ఎన్నికలలో అధ్యక్షునిగా తడక మాధవరావు, ఉపాధ్యక్షునిగా వాసుదేవ పాణిగ్రహి, జనరల్ సెక్రెటరీగా టీ వీ కే నాగరాజు, కోశాధికారిగా చంద్రశేఖర్ పట్నాయక్, జాయింట్ సెక్రటరీగా ఎర్ర రవి కుమార్, అసిస్టెంట్ సెక్రటరీగా రంగోయి దేవేంద్రరావు ఎన్నికయ్యారు. అలాగే ఎగ్జిక్యూటివ్ మెంబెర్స్ గా కప్పు గోపీనాథ్, యారాడ ఆనందరావు, మందుల శ్రీనివాసరావు మీడియా ప్రతినిధిగా బి జానకిరావు ఎన్నికయ్యారు.

## నరసన్నపేట-జలుమూరు రహదారి గుంతలమయం

### -ప్రమాదాలకు కారణమవుతున్న దెబ్బతిన్న రోడ్డు

### -తక్షణమే మరమ్మతులు చేపట్టాలని వాహనదారుల విజ్ఞప్తి

**నరసన్నపేట, జూన్ 8(వార్త):** నరసన్నపేట నుంచి కరగాం మీదుగా జలుమూరు వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయంగా మారి వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. రహదారిపై భారీ గుంతలు ఏర్పడటంతో నిత్యం ఈ మార్గంలో ప్రయాణించే ప్రజలు, వాహనదారులు ప్రమాదభయంతో రాకపోకలు సాగిస్తున్నారు. ప్రధానంగా రహదారిపై తారు పూర్తిగా పెచ్చులూడిపోవడంతో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. రోజురోజుకూ గుంతల పరిమాణం పెరుగుతూ ఉండటంతో వాహనాలు అదుపుతప్పే పరిస్థితులు నెలకొంటున్నాయని స్థానికులు చెబుతున్నారు. రహదారిపై నుంచి తారు రాళ్లు బయటకు రావడంతో అవి వాహనాల టైర్లకు గుచ్చుకుని తరచూ పంక్చర్లు అవుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. ఈ రహదారి ద్వారా అనేక గ్రామాల ప్రజలు నిత్యం నరసన్నపేట, జలుమూరు ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, వ్యాపారులు ఈ మార్గంపైనే ఆధారపడుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. వర్షాలు కురిసే సమయంలో గుంతల్లో నీరు నిల్వ ఉండటంతో ప్రమాదాల ముప్పు మరింత పెరిగే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి గుంతలను పూడ్చి రహదారిని మరమ్మతు చేసి ప్రయాణానికి అనుకూలంగా మార్చాలని వాహనదారులు కోరుతున్నారు.



## కార్గో ఎయిర్‌పోర్ట్‌ను వ్యతిరేకించం

### - ప్రత్యామ్నాయ స్థలంలో నిర్మించాలని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు విజ్ఞప్తి

### - రెండేళ్ల అరాచక పాలనపై టౌన్ హాల్ సదస్సు విజయవంతం



**పలాస, జూన్ 8 (వార్త):** కార్గో ఎయిర్‌పోర్ట్‌కు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకం కాదని, ప్రత్యామ్నాయ స్థలంలో నిర్మించాలని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు విజ్ఞప్తి చేశారు. పలాస నియోజకవర్గంలోని కాశీబుగ్గలో ఏర్పాటు చేసిన టౌన్ హాల్ సదస్సు మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించబడింది.

ఈ కార్యక్రమంలో పలాస, వజ్రపుకొత్తూరు, మందస మండలాలతో పాటు పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ హోదాల్లో ఉన్న ముఖ్య నాయకులు, మేధావులు, రైతులు, విద్యార్థులు, ప్రజా సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ ఉద్దానం ప్రాంత ప్రజల దీర్ఘకాల పోరాటానికి తాము పూర్తి మద్దతు తెలుపుతున్నామని అన్నారు. కార్గో ఎయిర్‌పోర్ట్ నిర్మాణాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకిస్తోందని జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని స్పష్టం చేశారు. "మేము ఎయిర్‌పోర్ట్ వద్దనడం లేదు. అభివృద్ధిని అడ్డుకోవడం లేదు. కానీ పచ్చని పంట పొలాలను నాశనం చేసి ఎయిర్‌పోర్ట్ నిర్మించడాన్ని మాత్రమే వ్యతిరేకిస్తున్నాం" అని పేర్కొన్నారు. గూగుల్ మ్యాప్‌లో పరిశీలించినా అక్కుపల్లి నుంచి బేతాళపురం వరకు విస్తారమైన పచ్చని వ్యవసాయ భూములు కనిపిస్తాయని, అలాంటి సస్యశ్యామల ప్రాంతాన్ని నాశనం చేయకుండా ఇతర అనుకూల ప్రాంతాల్లో ఎయిర్‌పోర్ట్ నిర్మించాలని సూచించారు.

వజ్రపుకొత్తూరు మండలం నగరంపల్లి పంచాయతీ పరిధిలో సుమారు 1890 ఎకరాల సాల్ట్ ల్యాండ్స్ అందుబాటులో ఉన్నాయని, అక్కడ కార్గో ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి అనుకూల పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. సాల్ట్ ల్యాండ్స్‌లో నిర్మాణాలు సాధ్యం కావని కొందరు చేస్తున్న వ్యాఖ్యలను ఖండిస్తూ, ప్రపంచవ్యాప్తంగా అనేక విమానాశ్రయాలు, భారీ నిర్మాణాలు ఇటువంటి భూములపైనే నిర్మించబడ్డాయని చెప్పారు. సూరత్ అంతర్జాతీయ విమానాశ్రయం కూడా సాల్ట్ ల్యాండ్స్ ప్రాంతంలోనే నిర్మించబడిందని, నగరంపల్లి ప్రాంత భూములు దానికి ఏమాత్రం తీసిపోవని పేర్కొన్నారు. అధికారులు ఈ అంశాన్ని శాస్త్రీయంగా పరిశీలించాలని కోరారు. భావనపాడు పోర్టు నిర్మాణ అంశాన్ని ప్రస్తావిస్తూ, గతంలో ప్రతిపాదిత ప్రాంతంలో సమస్యలు ఉండటంతో ప్రజల అభిప్రాయాలను గౌరవించి మూలపేట ప్రాంతంలో పోర్టు నిర్మాణానికి తమ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని గుర్తుచేశారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, స్థానిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. కార్గో ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి తమ పోరాటం కొనసాగుతుందని, ప్రభుత్వం పునరాలోచన చేసి నగరంపల్లి ప్రాంతాన్ని పరిశీలించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే భవిష్యత్తులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతుల నుంచి ఒక్క ఎకరం భూమి కూడా సేకరించకుండా నగరంపల్లి ప్రాంతంలోనే కార్గో ఎయిర్‌పోర్ట్ నిర్మించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. జీడిపిక్కలకు గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు కోరితే జీడి తోటలను తొలగిస్తామని హెచ్చరించడం బాధాకరమని, రైతుల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున ఇటువంటి బెదిరింపులను తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సదస్సులో పలువురు పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, రైతు సంఘాల నాయకులు, మేధావులు తదితరులు పాల్గొన్నారు.

## చట్టం ప్రకారమే మార్కెట్ సెస్ వసూలు

### -ఆన్‌లైన్ మార్కెట్ సెస్‌పై అపోహలు వద్దు

### -పలాస వ్యవసాయం మార్కెట్ కమిటీ స్పష్టీకరణ

**పలాస,జూన్ 8 (వార్త):** వ్యవసాయ మార్కెట్ కమిటీ చట్టం ప్రకారమే మార్కెట్ సెస్ వసూలు

ఆన్‌లైన్ మార్కెట్ సెస్‌పై అపోహలు వద్దని పలాస వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షులు మల్లా శ్రీనివాసరావు అన్నారు. సోమవారం పలాస వ్యవసాయ మార్కెట్ కమిటీపై సోషల్ మీడియా, కొన్ని మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని మార్కెట్ కమిటీ ప్రతినిధులు స్పష్టం చేశారు. 1966 ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చట్టం ప్రకారమే మార్కెట్ సెస్ వసూలు చేస్తున్నామని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లా శ్రీనివాసరావు తెలిపారు. ప్రస్తుతం అన్ని ప్రభుత్వ,ప్రైవేట్ సేవలు ఆన్‌లైన్‌లోకి మారినట్లే మార్కెట్ సెస్ చెల్లింపులను కూడా ఆన్‌లైన్ విధానంలోకి తీసుకువచ్చినట్లు చెప్పారు. ఈవిధానం కొత్తది కాదని, 2018లోనే ప్రవేశపెట్టినప్పటికీ సాంకేతిక కారణాలతో నిలిచిపోయిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జూలై 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఆన్‌లైన్ సెస్ విధానాన్ని అమలు చేయాలని, ఆదేశాలు జారీ చేయడంతో పలాస మార్కెట్ యార్డ్‌లో కూడా డీలర్ల నుంచి దరఖాస్తులు స్వీకరించి ప్రక్రియను పూర్తి చేస్తున్నట్లు వివరించారు. ఆన్‌లైన్ విధానం వల్ల డబుల్ టాక్సేషన్ జరుగుతుందనే ప్రచారంలోఎలాంటి వాస్తవం లేదని ఆయన స్పష్టం చేశారు. ఇది పన్ను (టాక్స్) కాదని, చట్టబద్ధమైన మార్కెట్ సెస్ మాత్రమేనని తెలిపారు. రైతుల వద్ద నుంచి జీడిపిక్కలు కొనుగోలు చేసే సమయంలో కొనుగోలు విలువపై 1 శాతం సెస్ వసూలు చేయడం జరుగుతుందని చెప్పారు. ఉదాహరణకు రూ.10 వేల విలువైన జీడిపిక్కలు కొనుగోలు చేస్తే రూ.100 మాత్రమే సెస్ చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. ఆన్‌లైన్ విధానం అమలుతో డీలర్లు మార్కెట్ కార్యాలయాలకు వచ్చి నగదు చెల్లించాల్సిన అవసరం ఉండదని, చెల్లింపు పూర్తయిన వెంటనే రసీదు ఆన్‌లైన్‌లో అందుబాటులోకి వస్తుందని తెలిపారు. దీనివల్ల వ్యాపారులకు సమయం, ఖర్చు ఆదా కావడంతో పాటు పారదర్శకత పెరుగుతుందని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో సెస్ భారం తక్కువగానే ఉందని చెప్పారు. ఒడిశాలో జీడిపిక్కలపై అధిక సెస్ వసూలు చేస్తున్నారని, కర్ణాటకలో 1.25 శాతం సెస్ అమలులో ఉందని తెలిపారు. తమిళనాడు మినహా దేశంలోని చాలా రాష్ట్రాల్లో మార్కెట్ సెస్ విధానం కొనసాగుతోందని వివరించారు. స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీష కూడా జీడి పరిశ్రమ అభివృద్ధికి అనుకూలంగా అసెంబ్లీలో ప్రస్తావించిన విషయాన్ని గుర్తు చేశారు. పరిశ్రమ అభివృద్ధి చెందితే రైతులకు గిట్టుబాటు ధర లభించడంతో పాటు స్థానికంగా ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని పేర్కొన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం మార్కెట్క మిటీ, రైతులు, కార్మికులను తప్పుదోవ పట్టించేలా తప్పుడు ప్రచారాలు చేయవద్దని మార్కెట్ కమిటీ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. పలాస ప్రాంతంలో వ్యాపారులు, రైతులు, కార్మికులు దశాబ్దాలుగా పరస్పర సహకారంతో వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని, అదే సహకార భావనతో ముందుకు సాగాలని కోరారు. ఈ సమావేశంలో ఏఎంసి ఉపాధ్యక్షురాలు మట్ట చంద్రకళ, డైరెక్టర్లు ఎన్ రామారావు, బి భాస్కరరావు, తేశ్వరరావ్, కే బాలకృష్ణ, శాంతి కుమారి, ఆశ రాణి, ఏం సి సెక్రెటరీ సిహెచ్ ఆంద్రయ్య, సూపర్వైజర్లు మురళి సాగర్, వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.





## సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులకు అవగాహన

### 'ల్యాబ్ ఆన్ వీల్స్' కార్యక్రమంలో ఆధునిక పరికరాల ప్రదర్శన

### - భవిష్యసాంకేతికతతోనే ముందుకు సాగుతుందని ఎంఈఓ ఉప్పాడ శాంతారావు



**నరసన్నపేట, జూన్ 8(వార్త):** భవిష్యత్తులో సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకున్నవారే అన్ని రంగాల్లో ముందంజలో నిలుస్తారని, విద్యార్థులు చిన్న వయసులోనే ఆధునిక సాంకేతికతపై అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని మండల విద్యాశాఖాధికారి (ఎంఈఓ) ఉప్పాడ శాంతారావు తెలిపారు. సోమవారం నరసన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన 'ల్యాబ్ ఆన్ వీల్స్' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక సంచార వాహనంలో ఏర్పాటు చేసిన వివిధ సాంకేతిక పరికరాలు, శాస్త్రీయ నమూనాలు, ఆధునిక విద్యా ఉపకరణాలను విద్యార్థులకు ప్రదర్శించి వాటి వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు సైన్స్, టెక్నాలజీ, డిజిటల్ విద్యకు సంబంధించిన పరికరాల పనితీరు వివరించారు. కొత్త ఆవిష్కరణలు, సాంకేతిక అభివృద్ధి గురించి విద్యార్థులు తెలుసుకోవడం ద్వారా వారి ఆలోచనా విధానం మెరుగుపడుతుందని ఎంఈఓ పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు కూడా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం చేరువ చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. విద్యార్థులు సాంకేతికతను సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై చర్యలు చేపట్టాలి

### పోలీసులకు ఫిర్యాదు చేసిన టిడిపి నాయకుడు "బడ్డ"



**పలాస, జూన్ 8 (వార్త):** శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పలాస-కాశీబుగ్గ పట్టణ టీడీపీ అధ్యకులు బడ్డ నాగరాజు ఆధ్వర్యంలో పోలీసు స్టేషన్ లో సోమవారం ఫిర్యాదు చేశారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ప్రజల తాగునీటి సమస్యలను అత్యవసరంగా పరిష్కరించడం, ప్రభుత్వ అభివృద్ధి పనులను వేగవంతం చేయడం, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడం, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన కోరారు. మున్సిపాలిటీ పరిధిలో సుమారు రూ.122 కోట్ల వ్యయంతో చేపట్టిన ప్రాజెక్టులకు సంబంధించిన పూర్తి వివరాలను ప్రజలకు వెల్లడించాలని నాగరాజు డిమాండ్ చేశారు. ఒకే హెడ్‌వర్క్స్ నుంచి తాగునీటి సరఫరా జరుగుతున్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత ప్రాజెక్టుల నివేదికలు, ఎలక్ట్రానిక్ మీడియా ఛానళ్లలో ప్రచారమైన అంశాలు, పెన్‌డ్రైవ్ ద్వారా అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని అధికార యంత్రాంగం స్పందించాలని, మున్సిపాలిటీలో పారదర్శక పాలన కొనసాగించాలని ఆయన కోరారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న భారతీయ న్యాయ సంహిత (బి ఎన్ఎస్ ), ఇతర చట్టాల ప్రకారం ప్రజల సమస్యలను పరిష్కరించడం, తాగునీటి సరఫరా మెరుగుపరచడం, శాంతిభద్రతలను కాపాడడం వంటి అంశాల్లో అధికారులు చొరవ చూపాలని బడ్డ నాగరాజు విజ్ఞప్తి చేశారు. ఈయనతో పాటు టిడిపి నాయకులు జోగ మల్లి, ఐటిడిపి అధ్యక్షుడు అరియాపల్లి ప్రభుదాస్ తదితరులు ఉన్నారు.

## రైతులు ఆధార్ అనుసంధానం చేసుకోవాలి

**ఇచ్ఛాపురం, జూన్ 8 (వార్త):** ధర్మపురంలో రైతు ధృవీకరణ, వెబ్‌ల్యాండ్-ఆధార్ అనుసంధానం మరియు ఎరువుల లభ్యతపై అవగాహన సమావేశం నిర్వహించారు.ఇచ్ఛాపురం మండలం ధర్మపురం గ్రామంలో రైతులకు ఎరువుల పంపిణీ సజావుగా జరిగేలా రైతు ధృవీకరణ, వెబ్‌ల్యాండ్--ఆధార్ అనుసంధానం, భూ వివరాల ధృవీకరణ మరియు ఎరువుల వినియోగంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తహసీల్దార్,వెంకట రావు మండల వ్యవసాయ అధికారి అజయ్ కుమార్, ఎంపీడీవో ప్రభాకర్ రావు, సంబంధిత శాఖల అధికారులు, రైతు సేవా కేంద్రం సిబ్బంది, వి అర్ వోలు, డిజిటల్ అసిస్టెంట్లు మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వ్యవస్థలో రైతుల ధృవీకరణ పూర్తిగా జరిగి, వెబ్‌ల్యాండ్‌లోని భూ వివరాలు ఆధార్‌తో అనుసంధానమై ఉండటం ఎరువుల పంపిణీకి తప్పనిసరి అని తెలిపారు. రైతులు తమ ఆధార్, భూ రికార్డులు మరియు ఇతర అవసరమైన వివరాలను త్వరితగతిన ధృవీకరించుకోవాలని సూచించారు. రైతులకు అవసరమైన విత్తనాలు మరియు ఎరువుల నిల్వలను అధికారులు పరిశీలించి, ప్రస్తుత వ్యవసాయ సీజన్‌కు సరిపడా నిల్వలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. రైతులు ఎరువుల కొరతపై ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రతి రైతుకు అవసరానికి అనుగుణంగా మరియు అందరికీ సమానంగా సరిపడా ఎరువులు అందజేయబడతాయని వివరించారు. అలాగే, రైతులు సిఫారసు చేసిన మోతాదుకు మించి ఎరువులు వినియోగించరాదని, భూసార పరీక్షల ఫలితాలు మరియు వ్యవసాయ శాఖ సూచనలను అనుసరించి మాత్రమే ఎరువులను వినియోగించాలని సూచించారు. అధిక మోతాదులో ఎరువుల వినియోగం వల్ల అనవసర వ్యయం పెరగడంతో పాటు నేల ఆరోగ్యం దెబ్బతినే అవకాశం ఉందని వివరించారు. రైతుల ధృవీకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి, ఎరువుల పంపిణీ సమయంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జీలు, లు మరియు డిజిటల్ అసిస్టెంట్లకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకోగా, అధికారులు రైతులకు అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.



## ఘనంగా కొరికాన భవాని జన్మదిన వేడుకలు



**కొత్తూరు, జూన్ 8(వార్త):** పాతపట్నం నియోజకవర్గ జనసేన నాయకురాలు కొరికాన భవాని జన్మదిన వేడుకలను కొత్తూరు మండలంలో ఘనంగా నిర్వహించారు.మండలంలోని జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై భవాని కి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. పార్టీ అభివృద్ధి కోసం భవాని చేస్తున్న సేవలను నాయకులు కొనియాడారు. ప్రజలకు అండగా నిలుస్తూ, పార్టీ బలోపేతానికి ఆమె నిరంతరం కృషి చేస్తున్నారని పలువురు నాయకులు అభినందించారు.జనసేన పార్టీ మరింత బలోపేతం కావాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో నాయకులు సమిష్టిగా ముందుకు సాగాలని ఈ సందర్భంగా పలువురు ఆకాంక్షించారు. జన్మదిన వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో అంగరంగ వైభవంగా కొనసాగాయి. ఈ కార్యక్రమంలో కొత్తూరు మండల అధ్యక్షులు దొంపాక జయరాజు, ఏఎంసీ ఉపాధ్యక్షులు అడపాక అశోక్, మండల ఉపాధ్యక్షులు తలచంద్రి శివ,మండల సీనియర్ నాయకులు లోతుగెడ్డ తిరుపతిరావు, బూరెల శ్రీనివాసరావు, కొత్తూరు శ్రీరాములు నాయుడు, లోతుగెడ్డ జనార్ధనరావ, గోలే చంటి, చోడవరపు సింహాచలం, కడగల రవి, లోపింటి రవి, దారపు వినయ్, పెదాడ చక్రధర్, గొర్లె చంటి, ధర్మ, కొత్తూరు రాజు, సంతోష్ కుమార్,పాట్నూరు సంతోష్ మరియు ఇతర జనసేన పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546